రవాణా మంత్రి రాజకీయం.

# రైలురస్తా రద్దుచేస్తా

★ మహేశ్వర్ ★

★

"హే రావణా మంత్రీ!"

"నేను రవాణా మంత్రినండి!"

"అదేలే! పొరబాటు! రవాణామంత్రీ! ఈపొగ బళ్లు తిరగబడ్డం రానురాను అధికతరం ఔతోందే"

"అంతామాయ! ఏమీ అర్థం కావడంలేదు! టిక్కెట్లధరలు పెంచమంటే పెంచేను! ప్రజల బుర్రకొట్టి పాడునంపాదన చెయ్యడం వల్లనే. ఇలా!"

"తెలివి తక్కువ! ధరలుపెంచకపోతే ఉద్యోగుల కరువుబత్తెలు అధికంగా ఎక్కడనుండి ఇస్తాం?"

"..ళ్ళకి జీతాలకన్న పరింతలు లంచాలవల్ల వస్తుందండి! ప్రతిరైల్వే నర్వెంటు ఎక్కడేనా అమ్మకానికి భూములూ ఇళ్లు వున్నాయా అని చాలా ఆతృత పడుతున్నాడు"

"అది వేరేసమస్య! ఈ ప్రమాదాలకి అంతు కనుక్కున్నారా?"

"లేదండీ సార్! నాకు ఏమీ తోచడంలేదు"

"నీకు జీతం ఎంత?"

"నా శక్రటరీని అడగాలండి!"

"ఇప్పటికి జరిగిన ప్రమాదాల్లో జననష్టం ఏమాత్రం"

"ఏదండీ? ఒక ప్రమాదంయొక్క లెక్కలు తయారౌతున్నాయో లేదోగాని మళ్ళా మరొకటి అంతకు మించింది జరుగుతూంది!"

"వెంటనే 'ప్రమాద పర్యవేక్షణ' శాఖని అధికం చెయ్యి?"

"చిత్తం చాలామంది ఉన్నారండి. అసలు కొన్ని ప్రమాదాల్లో ఆనవాలుకేనా మనిషి ఎముకలుకూడా దొరకలేదండి!"

"ఈప్రమాదాల ప్రతిఘటనకి ఒక్కటే ఉపాయం!"

"శలవియ్యండి"

"నేటినుండి రైలుబళ్లు సర్వం కాన్సిల్! రైల్వే కంపెనీలన్నీ శాశ్వతంగా మూసివేదాం?"

"మరి నామంత్రిపదవి పోతుందండి!"

"నీకు సర్దార్ జీతో మొహమాటం ఉంది గనుక మరోపదవి వెంటనే వస్తుంది"

"నాకీ రవాణాపదవే బావుందండి!"

"ఇప్పటికి ఎన్ని కోట్లజీవాలు రవాణా చేసేవ్?"

"లెఖ్ఖలు దాఖల్ చేసుకుంటా లెండి"

"సరే! ప్రస్తుతం ఉన్నరైల్వే లైనులన్నీ పీకించి పారేయ్ ఈలైను మనకి అచ్చిరాలేదు. మరొక ప్రాంతంనుండి కొత్తలైను వేసేందుకి ప్రణాళిక తయారుచెయ్యి! మళ్లా కొత్తపట్టాలు కొత్త సామాను, కొత్త రైల్వే స్టేషన్లు అన్నీ ప్రణాళికల్లో ఉండాలి"

"దుర్మార్గులు కొత్తలైనుమీద మాత్రం దాడి చెయ్యరని గేరంటీ ఉందా?"

"ఐతే రైల్వేలైను నేలమీద వుండకుండా కాస్త ఎత్తుగా ఇరవై అడుగులు భూమికిపైగా వుండేటట్లు మార్గం కనిపెట్టు!"

"అమెరికా ఇంగ్లండు ఒక ట్రిప్పుకొట్టి వస్తానండి!"

"వెళ్ళి ఇంజనీర్లని సమాలోచిస్తావా? మంచిది! స్పెషల్ ప్లేన్‌లో వెళ్లు!"

చిత్తం! భూగర్భమార్గం రైలు ప్రయాణాలు ఆదేశాల్లో వున్నాయండి—అవన్నీ చూసి మన దేశంలోకూడా ప్రవేశపెడితే ప్రమాదాలపీడ వదులుతుంది!"

"బావుంది! రైలుకిరైలే భూమిలో పాతేస్తే మరి రుజువూ, సాక్ష్యం ఉండదనా?"

"కాదండి! అదిబాగా హాయిగా వుంటుంది! అండర్‌గ్రౌండు ఇనపదారి చాలా శ్రేయస్కరం"

"అంతకన్నా విమానసర్వీసు పెంచుతే బావుంటుంది"

"అబ్బే! ప్రజలంత విమానాల్లో ప్రయాణం సాగిస్తే మంత్రుల డిగ్నిటి పోతూందండి! విమానాలంటే మంత్రులకే! రేపు మాల వీరన్నకూడా విమానంలోవెళ్తే మరి మనవేల్యూ ఏముందండి?"

"మంత్రీ ఇదేదీకాదు! దేశంనిండా సముద్రాలు నదులు సృష్టించు! ఓడసర్వీసు అధికం చేద్దాం?"

"ఐతే సముద్రం ప్రణాళిక కావాలన్నమాట"

"అదే! అదే! జలప్రణాళిక! ఈసారిరాష్ట్రాల్లో వరదలు సంభవిస్తే ఆనీరు జాగ్రత్తగా నిలవచేసి బోటు సర్వీసులువేస్తే—రైళ్లు కాస్త తగ్గించవచ్చు!"

"మరి నా అమెరికా ప్రయాణం?"

"వెళ్లు! నీకుఅమెరికాప్రజ ఘనమైన స్వాగతం చేయుగాక!"

* *

"ఏయ్. టిక్కట్టులేకండా ప్రయాణం చేస్తున్నావ్? నీతాతగారి రైలా?"

"చిత్తం! చిత్తం! బతికి ప్రాణాల్తో మావూరు స్టేషన్ చేరగానే టిక్కట్టు డబ్బు కట్టేస్తానండి!"


# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు 1

★

(ప్రచురణ ప్రతి ఆదివారం)

సాలుచందా . రు 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

★

* అరసంవత్సరముకంటె తక్కువ చందాలు అంగీకరింపబడవు

* 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు మేనేజరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబుచెట్టివీధి, జి.టి. మద్రాసు" అని వ్రాయవలెను. వ్యక్తుల పేర పంపవద్దు.

—మేనేజరు